క్లుప్తంగా

కంచె ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏర్పాటుచేసిన కంచె

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురం రూరల్: మండలంలోని కొత్తపట్నం గ్రామంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న రెండవ అంగన్వాడీ కేంద్రం అద్దె భవనాన్ని ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. ఈ మేరకు జూన్ 27న సాక్షి దినపత్రికలో 'ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత' అనే కథనం వెలువడింది. ఈ కథనంపై విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు, అంగన్వాడీ విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

అరకొర యూరియాతో అవస్థలు



నారాయణపురం రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

బలిజిపేట: ప్రభుత్వం అరకొరగా చేస్తున్న యూరియా సరఫరాతో రైతులు అవస్థలు పడుతున్నారు. రైతు సేవాకేంద్రాలకు అరకొరగా వస్తున్న యూరియా కోసం వెంపర్లాడుతున్నారు. ఎన్ని ఎకరాలు ఉన్నా ఒక్క యూరియా బస్తా మాత్రమే ఇస్తున్నారని ఇలా అయితే రైతులకు అవసరమైన ఎరువులు ఎలా అందించగలరని ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో యూరియా అందుబాటులో లేక పోవడం, రైతు సేవాకేంద్రాలకు అరకొరగా రావడంతో పరుగులు తీయాల్సి వస్తోందని రైతులు లబోదిబోమంటు న్నారు. గత 5సంవత్సరాల కాలంలో ఎరువుల కోసం ఎప్పుడూ ఇలా పడిగాపులు పడలేదని, ఇప్పుడు మళ్లీ పాతరోజులు గుర్తుకువస్తున్నాయని రైతులు నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఆర్థికసాయం లేదు, కనీసం అవసరమైన ఎరువు అందుబాటులో ఉంచడం లేదని, ఇదేం పద్ధతి అంటూ వాపోతున్నారు.

కుట్టుమూర్తుల తయారీలో నైపుణ్యం పెంపొందించుకోవాలి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: నిరుద్యోగులైన టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళ లంతా నైపుణ్యంతో కూడిన శిక్షణ పొంది ఆర్థికంగా లబ్ధి చేకూర్చుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న కుటు శిక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గతంలో కుట్టుమూర్తుల తయారీ కేంద్రాల్లో శిక్షణ పొందిన వారు ప్రస్తుతం బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టుమూర్తుల తయారీకి శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ మేరకు అందరూ కుట్టు శిక్షణ పొంది నప్పటికీ కుట్టుమూర్తుల తయారీలో నైపుణ్యం పెంపొందించు కోవాలని కోరారు. ఇప్పటికే 30 మందివరకూ కుట్టు మూర్తులు తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి



మురుగు కాలువల్లో దోమల మందు పిచికారీ జరిపిస్తున్న దృశ్యం

మక్కువ: దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పంచాయతీ అధికా రులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మక్కువ మండల కేంద్రంలో శుక్రవారం ఈవో బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో దోమలు వృద్ధి చెందకుండా మురుగు కాలువల్లో ఎబిట్ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున, చెత్త నిల్వలేకుండా చూడాలని కోరారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నీరు నిలవలేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేగేటుతో అవస్థలు



రైల్వే గేటు వేయడంతో గేటు దాటి వెళ్తున్న వాహనచోదకులు, స్థానికులు

- ఇబ్బందులు పడుతున్న 20 గ్రామాల ప్రజలు
- సమస్యపై ఎంపీ డాక్టర్ తనూజారాణికి వినతి

పార్వతీపురంటౌన్:

జిల్లా కేంద్రంగా పార్వతీపురం పట్టణం ఏర్పడిన తరువాత జనసాంద్రతతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరిగింది. రోజురోజుకూ వాహనాలు పెరుగుతుండడంతో బెలగాం రైల్వే గేటు పడిన సమయంలో అక్కడ భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. పార్వతీపురం పట్టణంలోని ఒక భాగమైన బెలగాంతో పాటు బాలగుడబ, పెదగుడబ, చినగుడబ, వల్లరిగుడబ తదితర 20 గ్రామాల ప్రజలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే, రైళ్ల రాకపోకలు సాగించే వేళలో బెలగాం వద్ద ప్రతిసారి దాదాపు అరగంటకు పైగా రైల్వే గేటు పడుతుంది. దీంతో అటుగా వెళ్లాల్సిన ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల మూడవ లైన్ కూడా వేయడంతో రైళ్ల రద్దీ మరింత పెరిగింది. నిత్యం వేలాదిమంది ప్రజలు, ఉద్యోగులు కార్యాలయాలకు, వివిధ పనుల నిమిత్తం ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేటప్పుడు గేటు పడిందంటే ఆలస్యంగా చేరుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాయాలు, పశుసంవర్థక శాఖ ఆస్పత్రి, వ్యవసాయశాఖ కార్యాలయం గేటుకు అటుపైపు ఉండడంతో బెలగాం వాసులతో పాటు 20 గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అత్యవసర చికిత్స అందని పరిస్థితి

రోగులకు సరైన సమయంలో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే చాకలి బెలగాంలో విద్యార్థుల ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. రైల్వే ట్రాక్ వల్ల సమయానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేమని భయపడి విద్యార్థులు వసతి గృహాల్లో చేరుతు న్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అండర్ పాస్ బ్రిడ్జి గానీ ఫ్లైఓవర్ గానీ నిర్మించాలని కోరుతున్నారు. కలెక్టర్, ఎస్పీ ఇలా అనేక కార్యాలయాలతో పాటు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటే ఇక్కడి నుంచి అర కిలోమీటరు దూరం మాత్రమే ఉంటుంది.

ట్రాఫిక్ అవస్థలు..

ఈ మార్గంలో రైళ్ల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో గేటు పడితే భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. చాలా సమయం వేచి ఉండాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వివిధ పనుల మీద పట్టణంలోకి వెళ్లాలంటే చాలా సమయం పడుతోంది. అండర్ పాస్ బ్రిడ్జి గానీ, ఫ్లై ఓవర్ గానీ నిర్మించాలి.

– కె. సాయిశ్రీనివాసరావు, బంగామ్మకాలనీ, పార్వతీపురం

ఇబ్బందులు పడుతున్నాం

బెలగాం వద్ద రైల్వే గేటు పడితే అరగంట వరకూ వేచి ఉండాల్సి వస్తోంది. మార్కెట్, ఆస్పత్రికి వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర వైద్యసేవల నిమిత్తం రోగులను తరలించే అంబులెన్సుల సైతం అరగంటపాటు నిలిచిపోవాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వెంటనే అండర్ బ్రిడ్జిని నిర్మించాలి.

– పి.గౌరీశంకరరావు, అగురువీధి, పార్వతీపురం

ఎంపీ డాక్టర్ తనూజారాణికి వినతి

తమ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజా రాణికి వినతి పత్రం అందజేశారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టిలో పెట్టి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనికి ఆమె స్పందించి సమస్య పరిస్కారానికి ప్రభుత్వం, అధికారులతో చర్చించి సత్వరమే సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.



ఎంపీ డాక్టర్ తనూజారాణికి సమస్యపై వినతి పత్రం అందజేస్తున్న పరిసర గ్రామాల ప్రజలు (ఫైల్)

ఎఫ్ఆర్ఎస్ ద్వారా స్నాక్స్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కనకదుర్గ

బలిజిపేట: అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా స్నాక్‌ను ఇవ్వాలని అంగన్వాడీ పీడీ టి.కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలో బలిజిపేట, సీతానగరం మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలతో శుక్రవారం ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్నాక్‌ను విధివిధానాలకు లోబడి ఇవ్వాలని సూచించారు. కేంద్రాలలో ఉండేవారికి మాత్రమే ఇవ్వాలని స్పష్టం చేశారు. 3నుంచి 6సంవత్సరాల పిల్లలకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలను వినియోగించి బోధించాలని చెప్పారు. కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. టాటా ట్రస్ట్ చారిటబుల్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కె.సుబ్రహ్మణ్యం పిల్లల బరువు, ఎత్తు ఏవిధంగా గుర్తించాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి మాటలు ఏమయ్యాయి?



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ

- పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు

పార్వతీపురం రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలను సందర్శించి సమస్యల సేకరణతో పాటు సభ్యత్వ నమోదులను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే వినియోగిస్తామని చెప్పిన విద్యాశాఖామంత్రి ఆ దిశగా ఆలోచించకపోగా యాప్‌ల భారం పెట్టి బోధనకు ఆటంకం కలగజేసే విధంగా చేయడం సమంజసం కాదని అన్నారు. ఈ సందర్భంగా పలువురు పీఆర్‌టీయూ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల విడుదలకు ప్రభుత్వం చొరవచూపి నూతన వేతన సవరణ సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాలలు ప్రారంభమై నెలదాటుతున్నా ఇంతవరకు హ్యాండ్‌బుక్స్ అందజేయలేదని తక్షణమే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బి.నారాయణ స్వామి, డి.లక్ష్మణనాయుడు,జె.రామినాయుడు, కె.విజయ్, జి. రామినాయుడు, బి.శ్రీనివాసరావు, బి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



అంటిపేటలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా దోమలు పెచ్చురిల్లే అవకాశం ఉందని దోమల నివారణపై ప్రత్యేక దృష్టిసారించామని డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు అంటిపేట పంచాయితీలోని గ్రామాల్లో సర్పంచ్ బి.తిరుపతిరావు పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి మురళి శుక్రవారం దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. పిచికారీ కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ మాట్లాడుతూ గ్రామాల్లో అరకొరగా కురుస్తున్న వర్షాల కారణంగా కాలువల్లో దోమల బెడద ఎక్కువగా ఉన్నందున దోమలు కుట్టడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతుంటారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ముందుజాగ్రత్త చర్యగా దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే క్లాప్ మిత్రల సహకారంతో పారిశుధ్య పనులు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.నిర్మల, పంచాయతీ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయం ఏఎన్ఎంలను రిలీవ్ చేయాలి



డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

పార్వతీపురం టౌన్: సచివాలయం ఏఎన్ఎంలను రిలీవ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై మన్మథరావు కోరారు. ఈ మేరకు ఏఎన్ఎంలతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలియజేసి జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన, ఏఎన్ఎంలు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న గ్రామ వార్డు గ్రేడ్ 3 సచివాలయం ఏఎన్ఎంలకు ఇద్దరు డీఎంహెచ్‌ఓల ఆధ్వర్యంలో సాధారణ బదిలీలు వెబ్ కౌన్సెలింగ్‌లో నిర్వహించారన్నారు. ఇందులో తాము ఎంచుకున్న సచివాలయాల ఆర్డర్లు పీహెచ్‌సీల మెయిల్ అడ్రస్‌కు వచ్చాయన్నారు. తాము ఆ ఆర్డర్లు పట్టుకుని పార్వతీపురం డీఎంహెచ్ ఓ కార్యాలయానికి వచ్చి డీఎంహెచ్‌ఓ భాస్కర్ రావును కలిసి చెప్పామని పీటీఎం మీటింగ్స్ ఉన్న కారణంగా ఈ నెల 11 రమ్మని చెప్పగా మళ్లీ 11వ తేదీన వచ్చామన్నారు. తమలో కొంతమందికి ఆ రోజు మూమెంట్ ఆర్డర్స్ ఇచ్చారని, కానీ కొంతమందికి మూమెంట్ ఆర్డర్ 14వ తేదీన ఇచ్చారన్నారు. కానీ 9వ తేదీ డేట్ వేసి ఇచ్చారని తాము ఆ ఆర్డర్ పట్టుకుని పీహెచ్‌సీ డాక్టర్స్‌ను కలవగా వారు రిలీవ్ చేయబోమని చెప్పారన్నారు. తమకు సరైన పరిష్కారం చూపించ వలసిందిగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామవార్డు సచివాలయాల జిల్లా కార్యదర్శి బి.రమాదేవి, జి గౌరీశ్వరి, పుష్పలత, దమయంతి, బి.శైలజ, వివిధ సచివాలయాల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడరాదు

సాలూరు: దుకాణాల వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడరాదని, కాటన్ సంచుల ద్వారా విక్రయాలు జరపాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు అన్నారు. సఫాయి అప్నావో బీమారీ భగావో కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో కాయగూరలు, చిల్లర వ్యాపార దుకాణాల వద్ద సమావేశాలను నిర్వహించారు. వ్యాపారాలు ముగించిన తరువాత తమ విక్రయాల నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్లపై పారబోయకుండా, మున్సిపల్ పారిశుధ్య వాహనానికి అందించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే అపరాధరుసుము విధించాల్సి ఉంటుందన్నారు. అందరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

కూటమి ఇచ్చిన హామీలపై నిలదీయండి



రాజన్నదొరకు హారతులు పట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు, నాయకులు, ప్రజలు

సాలూరు: డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడిని, ప్రభుత్వాన్ని ఆ హామీ ఇంకా ఎందుకు అమలుచేయ లేదు? ఇంకెప్పుడు అమలుచేస్తారని ఆటోలు, క్యాబ్‌లు, లారీ డ్రైవర్లు నిలదీయాలని మాజీ పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని 20,21,22 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ క్రమంలో వార్డుల్లో తిరిగిన రాజన్న దొరకు అడుగడుగునా స్థానిక మహిళలు, ప్రజలు హారతులు పట్టి , పూలదండలు వేసి అడుగడుగునా నీరాజనం పలుకుతూ రాజన్నదొరపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ ఏడాది పాలనలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయలేదని వాపోతూ, తమ సమస్యలను ప్రజలు రాజన్నదొర ముందు ఏకరువు పెట్టారు.

డ్రైవర్లకు ఒక్క రూపాయి ఇవ్వలేదు

వాహనాల డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం నేటి వరకు ఒక్క రుపాయి కూడా ఇవ్వలేదని, గత ప్రభుత్వంలో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద ఏడాదికి రూ.15 వేలు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని, నేడు ఈ ప్రభుత్వంలో తమకు ఒక్క రుపాయి ఇవ్వలేదని డ్రైవర్లు నిట్టూర్చారు.

నాడు దుకాణాలు కళకళ, నేడు వెలవెల

గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యేదని ఆ డబ్బులతో ప్రజలు తమకు అవసరమైన వస్తువులు, సామగ్రి కొనుక్కోవడం ద్వారా నాడు పట్టణంలో దుకాణాలు కళకళలాడేవని రాజన్నదొర అన్నారు. నేడు ఇచ్చిన హామీలను అమలుచేయని కూటమి పాలనలో ప్రజలకు పథకాల నగదు రాక ఫలితంగా వ్యాపారాలు మందగించాయన్నారు.

కూటమి నేతలను ప్రశ

గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలతో పాటు సూపర్‌సిక్స్ పథకాలు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు, ఎన్నికల్లోనూ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అంతేకాకుండా 2014–19 మధ్య టీడీపీ పాలనలో అమలుచేసిన సంక్షేమ పథకాలను అమలుచేస్తామని నాడు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నేటికీ అమలు చేయలేదని కావున హామీలను అమలుచేయాలని టీడీపీ కూటమి నేతలను ప్రజలు నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు గిరిరఘు, అల్లు అక్కమ్మ, గొర్లె వెంకటరమణ,పిట్టా వాసు, పిరిడి రామకృష్ణ, గులిపల్లి నాగ, సింగారపు ఈశ్వరరావు,కొల్లు వెంకటరమణ, మజ్జి అప్పారావు, హరిబాలాజీ, కాకి పాండురంగారావు, మేకల శంకరరావు, తాడ్డి రమణ పాల్గొన్నారు.

సీతంపేట గిరిజనులకు న్యాయం చేయండి



సీతంపేటలో గిరిజనులతో కలసి మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం రూరల్: గడిచిన 40 సంవత్సరాలుగా జీవనం సాగిస్తూ నివాసాలు ఏర్పాటు చేసుకున్న పార్వతీపురం మండలంలోని సంగంవలస పంచాయతీ సీతంపేట గిరిజనులకు న్యాయం చేయాలని సీపీఎం మండల నాయకుడు పి.రాము కోరారు. ఈ ప్రాంతంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన కొందరు సెటిలర్స్ పేదలైన గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని ఆయన అన్నారు. సీతంపేట గిరిజనులు ఎన్నో ఏళ్లుగా సౌకర్యాలను ఏర్పాటు చేసుకుంటూ గత ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ హయాంలో కొన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోగా కొంతమంది సెటిలర్స్ ఊరిలో ఉన్న భూమిని ఆక్రమించి ఇల్లు కట్టుకొని గిరిజనుల స్థలాలను ఆక్రమించడం ఎంత వరకు సమంజసమని ధ్వజమెత్తారు. గ్రామ కంఠం ఎంత విస్తీర్ణంలో ఉందో సర్వేచేసి ఇళ్ల స్థలాలు గిరిజనులకు అప్పగించాలని అనేక మార్లు గ్రీవెన్స్ ద్వారా కలెక్టర్‌కు విన్నవించగా కలెక్టర్ అధికారులకు అప్పగించినప్పటికీ సమస్యకు పరిష్కారం ఇంతవరకు జరగలేదని, ఈ క్రమంలో సెటిలర్స్ మరింత భూమిని ఆక్రమించే పనిలో ఉన్నారని ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి సీతంపేట గిరిజనులకు న్యాయంచేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మహిళాసంఘం నాయకురాలు పి.వరాలు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్‌గైడ్స్ సేవలపై అవగాహన కల్పించుకోవాలి



మాట్లాడుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కోఆర్డి నేటర్ నారాయణస్వామి

సీతానగరం: విద్యార్థులకు విద్యతో పాటు క్వాలిటీ కలిగిన లీడర్ షిప్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, సామాజిక పరమైన భద్రత, వ్యక్తిగత భద్రతపై శిక్షణ పొందుతున్న స్కౌట్స్‌అండ్ గైడ్స్ ముఖ్య ఉద్దేశ్యమని శిక్షణ కోర్సు డైరెక్టర్ రజియా బేగం అన్నారు. ఈ మేరకు మండలంలోని జోగింపేట కేజీబీవీ క్రీడా ప్రాంగణంలో జిల్లా కోఆర్డి నేటర్ (కొమరాడ ఎంఈఓ) జె.నారాయణస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహవంతులైన వారిలో కొంతమందిని స్కౌట్స్ అండ్‌గైడ్స్ శిక్షణ పొందడానికి నియమితులైన వారికి జాతీయ విపత్తులు వచ్చిన సమయం, రోడ్డు, ట్రైన్ ప్రమాదాలు, నదులు ఉప్పొంగిన సమయాల్లో సేవలందించడానికి అవసరమైన శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నెల 15 నుంచి 19 వరకూ కోర్సు డైరెక్టర్లు శిక్షణ తరతగతులు నిర్వహిస్తున్నారన్నారు. కో ఆర్డినేటర్ నారాయణ స్వామి మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలోని 16 పీఎం శ్రీ స్కూల్స్ నుంచి 80 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందుతున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు వి చిన్నంనాయుడు, దుర్గా నాగేశ్వరరావు, సీహెచ్ నారాయణ మూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యపై ఆవేదన



సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న కుళాయి ద్వారా సరఫరా అయిన బురదనీరు ఫొటోలు

పార్వతీపురం/పార్వతీపురం రూరల్: సాక్షాత్తు టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, కూటమి కార్యకర్తలే పార్వతీపురం పురపాలక సంఘం వారు సరఫరా చేస్తున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెట్టారు. పట్టణంలోని పలు వార్డుల్లో దారుణమైన బురద నీరు మంచినీటి కుళాయిల ద్వారా సరఫరా అవుతోందని మున్సిపల్ కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని తమ ప్రాంతాల్లో మహిళలు పలుమార్లు ఈ సమస్యపై తమను నిలదీస్తున్నారని, ఈ మేరకు వాట్సాప్ గ్రూపుల్లో సమస్యను వివరిస్తూ సరఫరా చేసిన బురదనీటితో పోస్టులు పెట్టారు. ఈ మేరకు మరికొంతమంది ఇటీవల సరఫరా జరిగిన మురుగు నీరు చూపిస్తున్న మహిళల ఫొటోలను, అలాగే పురపాలకసంఘం కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన చేసిన ఫొటోలను సైతం షేర్ చేసి సమస్య తీవ్రతను ఎండగట్టారు. సాక్షాత్తు కూటమి ప్రభుత్వ నియోజకవర్గ ప్రధాన నాయకులు అనుచరులుగా ఉన్నవారే ఈ విధంగా సమస్యలు పరిష్కారం కాక సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేయడం పట్ల ప్రజా సంఘాల నాయకులు, పట్టణ ప్రముఖులు అవాక్కయ్యారు. పరిష్కారం చేయాల్సిన వారే పరిష్కారం కోసం సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం గమనార్హమని గుసగుసలాడుకుంటున్నారు.

ప్రమాదకరంగా బీటీ రోడ్లు

- రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు
- చినభోగిలి–సీతానగరం మధ్య గోతులు





సీతానగరం–చినభోగిలి మధ్య ప్రమాదకరంగా ఉన్న గోతులు, (ఇన్‌సెట్లో) సీతారాంపురం–పులిగుమ్మి గ్రామాల మధ్య ఏర్పడిన గోతులు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం బీటీ రోడ్లను పట్టించుకోక పోవడంతో వాహనచోదకులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి ఆమడ దూరంలో ఉన్న రోజువారీ వందలాది వాహనాలు తిరుగాడే హైవే బీటీరోడ్డుకు సీతానగరం–చినభోగిలి వద్ద ప్రమాదాలకు నిలయంగా గోతులు వారాయి. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. అలాగే చిన్నారాయుడుపేట మీదుగా ఒడిశా రాష్టానికి వెళ్లాల్సిన బీటీ రోడ్డు టి.సీతారాంపురం, పులిగుమ్మి గ్రామాల మధ్య గోతులు వారి నెలలు కావస్తున్నా ఇంతవరకూ పట్టించుకోలేదని, తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.అలాగే దయానిధిపురం రోడ్డు రాళ్లు తేలిపోవడంతో పిల్లలు (విద్యార్థులు) పాఠశాలలకు వెళ్లడానికి విముఖత వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.